

తెల్లపాడులో గడప గడపకూ..

కలసపాడు : మండలంలోని తెల్లపాడులో శనివారం గడపగడప మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ సుధా హాజరై ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. జగనన్న పక్కా గృహాలు, యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రభుత్వ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్, జడ్పిటిసి అంకన గురువు రెడ్డి, సుదర్శన్, ఎంపిపి, బోధన పోలన నారాయణ, సుధా రామకృష్ణారెడ్డి, ఎంపిడిఓ మహబూబ్‌బీ, తహశీల్దార్ రవీంద్రారెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ అల్లా ప్రకాష్, సిఆర్‌పి హసీనా పర్వీన్, హౌసింగ్ ఎఇ బాలిరెడ్డి, కలసపాడు మండల సచివాలయ బూత్ కన్వీనర్ కో-ఆర్డినేటర్, చిత్త రాజశేఖర్ రెడ్డి, ఎంపిటిసి నారాయణరెడ్డి, సర్పంచ్ జయన్న పంచాయతీ సెక్రెటరీ, సచివాలయ సిబ్బంది, వాలంటీర్ ప్రజలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

- అంగన్వాడీ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - కడప అర్బన్

అంగన్వాడీల సమస్యల పరిష్కారం కోసం జులై 10న అంగన్‌వాడీ కోర్కెల దినోత్సవం పురస్కరించుకుని దేశవ్యాప్తంగా బ్లాక్ డే నిర్వహిస్తున్నామని, రాష్ట్రంలో 10,11 తేదీల్లో అన్ని కలెక్టరేట్ల ఎదుట ఆందోళన నిర్వహించనున్నట్లు ఎపి అంగన్‌వాడీవర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరావమ్మ తెలిపారు. శనివారం జడ్‌పి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్ పరిరక్షణ కోసం పోరాటాలు ఉధృతం చేయాలని పిలుపు నిచ్చారు. అంగన్వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు నవరత్నాలు వర్తింపజేయాలన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఐసిడిఎస్‌ను నిర్వీరం చేసే విధంగా బడ్జెట్లో నిధులు తగ్గించిందని విమర్శించారు. గర్భిణులకు, బాలింతలకు, పేదలకు 48 సంవత్సరాలుగా కార్యకర్తలు, ఆయాలు సేవలు చేస్తున్నారని తెలిపారు. ఇప్పటి వరకు ఉద్యోగ భద్రత లేదని పేర్కొన్నారు. గౌరవ వేతనంతోనే బతుకుతున్నామని తెలిపారు. కరోనా లాక్ డౌన్ సమయంలో అనేక సేవలు చేశామని మోడీ ప్రభుత్వం మమ్మల్ని గుర్తించలేదని చెప్పారు. అంగన్వాడీలకు గ్రాటిటీ ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన పాలక ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. సెక్టార్, ప్రాజెక్టు సమావేశాలకు పోతే ఇవ్వాల్సిన టిఎ,డి ఎ బిల్లులు మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సెంటర్ అద్దెలు జీతాలు కూడా సరిగా ఇవ్వరని చెప్పారు. అంగన్వాడీలకు మెడికల్ సెలవులు ఇవ్వడం లేదని, చనిపోతే మట్టి ఖర్చులు కూడా ఇవ్వని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. అంగన్వాడీ సెంటర్లను కుదించడం మానుకోవాలని చెప్పారు. రాయలసీమ, కడప జిల్లాలో రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. నూనె, కందిపప్పు, గుడ్లు నాణ్యత లోపం ఉందని, అవి కూడా సరిగా ఇవ్వరని తెలిపారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ కార్యకర్తలను అవమానపరిచే తీరును ఖండిస్తున్నామని చెప్పారు. అంగన్‌వాడీలకు రావాల్సిన బిల్లు, పోపు సామానులు, అద్దెలు, వేతనాలు సకాలంలో ఇప్పించే వాటిపై శ్రద్ధపెట్టాలని హితవు పలికారు. అంగన్వాడీలు చాలా సహనంతో, ఓర్పుతో ఉన్నారని, వారిని ఇబ్బంది పెట్టవద్దని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇలాగే వ్యవహరిస్తే రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ప్రీ స్కూల్ పిల్లలకు జగనన్న కిట్ అందించాలని పేర్కొన్నారు. రాష్ట్ర నాయకులు లక్ష్మీదేవి, సుప్రజ, రమాదేవి, రాజేశ్వరి, నిర్మల, రేఖ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

సంతృప్త స్థాయిలో సమస్యలకు పరిష్కారం

ప్రజాశక్తి - కడప

ప్రజా సమస్యలకు సంతృప్త స్థాయిలో పరిష్కారం అందించడంతో పాటు అర్హులైన ప్రతీ లబ్ధిదారునికి సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలని కలెక్టర్ వి.విజయ్ రామరాజు అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుబంధంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 24 నుంచి జులై 23 వరకు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమం కార్యాచరణ నిర్వహణపై జిల్లా స్థాయి అధికారులతో కలిసి మండల స్పెషల్ ఆఫీసర్లు, కమిషనర్లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో సచివాలయాల సిబ్బంది, వాలంటీర్లు, గృహసారథులు ప్రతి ఇంటికీ వెళ్లి జగనన్న సురక్షా కార్యక్రమం గురించి వివరించాలన్నారు. ఆయా మండల్లాలో ఎంపిడిఒల ఆధ్వర్యంలో నెలరోజుల కార్యక్రమాలకు సంబంధించి ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వివిధ పథకాల కింద అర్హులుగా గుర్తించిన లబ్దిదారులకు ఆగస్టు 1న మంజూరు పత్రాలను అందజేస్తారన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ, మెప్మా, హౌసింగ్ పీడీలు జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి శారదా, డీసీవో సుభాషిణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేచే మెడికల్ స్టోర్ ప్రారంభం

ప్రజాశక్తి- కడప అర్బన్

నగర శివార్లలోని శాటిలైట్ సిటీ వద్ద ఏర్పాటు చేసిన న్యూ బాబా మెడికల్, ఫ్యాన్సీ స్టోర్‌ను కమలాపురం ఎమ్మెల్యే పోచం రెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి ఆయన తనయుడు, చింత కొమ్మదిన్నె మండల జడ్‌పిటిసి నరేన్ రామాంజులరెడ్డి శనివారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. మెడికల్ స్టోర్ యజమాని సుంకేసుల బాదుల్లా వారి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ చుట్టుపక్కల ఆసుపత్రి, మెడికల్ స్టోర్ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. వ్యాపారం బాగా జరగాలి అని ఆకాంక్షించారు. స్టోర్ యజమాని సుంకేసుల బాదుల్లా మాట్లాడుతూ మెడికల్ స్టోర్‌తో పాటు అనుభవం ఉన్న డాక్టర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. మొదట ఎమ్మెల్యే మందులను కొనుగోలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ పాకాసురేష్, వైసిపి సీనియర్ నాయకులు హఫీజ్ పాల్గొన్నారు.



బాదుల్లాను అభినందిస్తున్న ఎమ్మెల్యే

సమస్యలు డిఎల్ఎస్ఎ దృష్టికి తీసుకురావాలి

ప్రజాశక్తి - కడప

ఖైదీలకు ఏమైనా సమస్యలుంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) దృష్టికి తీసుకురావాలని అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎం. ప్రదీప్ కుమార్ అన్నారు. శనివారం ఆయన పురుషుల, మహిళ కేంద్ర కారాగారాలను సందర్శించారు. అక్కడ ఉన్న లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను విజిట్ చేశారు. పరిసర ప్రాంతాలను పరిశీలించారు. న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉచిత న్యాయ సహాయం, రక్షణ సలహా వ్యవస్థ ను వివరించారు. పారా లీగల్ వాలంటరీలు, లీగల్ ఎయిడ్ క్లినిక్స్ విధి విధానాలు తెలియజేశారు. ఆయన వెంట జైలు అధికారులు, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.



భోజనం రుచిచూస్తున్న జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్

'ఆర్ట్ అండ్ డిజైన్' ప్రవేశ పరీక్ష రద్దు

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలోని బ్యాచ్‌లర్ ఆఫ్ డిజైన్, ఫైన్ ఆర్ట్స్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్షను రద్దు చేసినట్లు టెస్ట్ కన్వీనర్, యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య ఇసి సురేంద్రనాథ్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఆదేశాల మేరకు ఇంటర్, డిప్లొమాలో సాధించిన మార్కులు ఆధారంగా అడ్మిషన్ ప్రక్రియ చేపడతామని తెలిపారు.మెరిట్, రిజర్వేషన్స్ తప్పకుండా పాటిస్తామని పేర్కొన్నారు.

ఆకాశవాణి సేవలు ప్రశంసనీయం

ప్రజాశక్తి - కడప అర్బన్


ఆకాశవాణి కడప కేంద్రం 1963, జూన్ 17న ఏర్పాటు చేసి 60 సంవత్సరాలు పూర్తి కావడం ఎంతో ప్రశంస నీయమని టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య అన్నారు. శనివారం నగరంలో ఉన్న ఎఐఆర్ ప్రసార కేంద్రం లోగోను పూలమాలతో అలంకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో ఆల్ ఇండియా రేడియో ప్రసారాలు ప్రజలను ఎంతో ఆకట్టుకున్నాయని తెలిపారు. కార్యక్రమంలో రాయల్ రషీద్, సంఘం అధ్యక్షులు అబ్దుల్ రాయల్ కరిముల్లా, ఆకాశవాణి కేంద్ర కార్యాలయ అధికారులు భవాని ప్రసాద్, విజయవాణి, సుజన, పద్మ పాల్గొన్నారు.

ఖాళీ కుర్చీలు దర్శనం

- లోపించిన సచివాలయ సిబ్బంది సమయ పాలన
- 11 మందికి నలుగురు మాత్రమే హాజరు
- నిరీక్షించి వెనుదిరిగిన ప్రజలు

ప్రజాశక్తి- ఒంటిమిట్ట (సిద్దవటం)

ప్రజలకు నాణ్యమైన పాలన అందించడమే కాకుండా, మరింత చేరువ చేయాలని ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. ఎంతో మంది నిరుద్యోగులకు గ్రామంలో ఉద్యోగం కల్పించింది. ఈవిధానం విజయవంతం కావడంతో పలు రాష్ట్రాలు అధ్యయనం చేసి అమలు చేయడానికి పూనుకున్నాయి. అయితే కొన్నిచోట్ల స్థానిక సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. సిద్ధవటం మండలంలోని మాధవరం-1 గ్రామంలో సచివాలయ ఉద్యోగుల తీరు అందరినీ విస్మయానికి గురి చేస్తోంది. సచివాలయంలో 11 మంది ఉద్యోగులు ఉండగా నలుగురు మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ఏడుగురు శనివారం విధులకు డుమ్మా కొట్టడం విశేషం. శనివారం ఉదయం11.30 దాటినా కూడా విధులకు హాజరుకాకపోవడం, కార్యాలయానికి వచ్చిన వారిని పట్టించుకోకపోవడంతో స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడటంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని వారు మండిపడుతున్నారు. సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు నిరీక్షించి వెనుదిరిగి వెళ్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకొని సక్రమంగా విధులు నిర్వర్తించేలా చూడాలని కోరుతున్నారు.



ఉదయం 11.30 గంటలైనా ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

ఆంగ్ల మాధ్యమ నైపుణ్యాభివృద్ధికి తోడ్పడాలి

ప్రజాశక్తి - కడప

శిక్షణ తరగతులు పాల్గొన్న ప్రతి అధ్యాపకులూ తమ వంతు బాధ్యతగా విద్యార్థులలో ఆంగ్ల మాధ్యమ నైపుణ్య అభివృద్ధికి తోడ్పడాలని, విద్యార్థులు ప్రపంచీకరణ పోటీకి సిద్ధపడాలని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి రవీంద్రనాథ్ సూచించారు. ఆర్ట్స్ కళాశాలలో ఆరు రోజులపాటు నిర్వహించిన ఆంగ్ల మాధ్యమం శిక్షణా తరగతులు శనివారం ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 18 మోడల్ రిసోర్స్ సెంటర్స్‌లో దాదాపు 1000 మంది అధ్యాపకులు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు అధ్యాపకులకు నూతన విద్య విధానాలకు అనువుగా నైపుణ్యాలు పెంచుకోవటానికి తోడ్పాడుతాయాని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ సి.వి.క్రిష్ణవేని, డాక్టర్ సహదేవరెడ్డి, క్రిష్ణారెడ్డి, హరి సుధాకరరావు, గురుమోహన్‌రెడ్డి అధ్యపకులు పాల్గొన్నారు.



శిక్షణ ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపల్

సిస్టోబాల్ ప్రపంచ కప్‌లో రన్నర్‌గా నిలిచిన 'కెఎస్ఆర్ఎం' పీడీ

ప్రజాశక్తి- కడప అర్బన్

ఢిల్లీ పబ్లిక్ స్కూల్, నార్త్ బెంగళూరులో సిస్టోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఏషియన్ సిస్టోబాల్ ఫెడరేషన్, అంతర్జాతీయ సిస్టోబాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ కప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో కెఎస్ఆర్ఎం కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వంశీనాయక్ రన్నర్‌గా నిలిచారని ప్రిన్సిపల్ డాక్టర్ విఎస్ఎస్ మూర్తి తెలిపారు. కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ ప్రేమ్ కుమార్, కళాశాల సిబ్బంది ఫిజికల్ డైరెక్టర్‌కు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



104 సేవలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - వల్లూరు

ప్రభుత్వం అందించే 104 సేవలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ ఖాదర్ వలీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని చెరువు కిందపల్లిలో 104 సేవలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సేవలు తప్పకుండా గర్భిణులు ,బాలింతలు, షుగర్, రక్తపోటు, టిబి రోగులందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం అందించడం, కాన్పులు ప్రభుత్వాసుపత్రిలో చేయించేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని గ్రామాల్లో లాప్రోస్ సర్వే నిర్వహించి పొడలు ఉన్న వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పనింద్ర, ఎఎన్ఎంలు, 104 సిబ్బంది పాల్గొన్నారు.



104 సిబ్బందికి సూచనలిస్తున్న డిఎంహెచ్ఒ ఖాదర్‌వలీ

విలువైన ఆస్తి..విద్య : కలెక్టర్

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్య అనేది పదిమందికి పంచగలమే కానీ ఏ ఒక్కరూ కూడా దొంగిలించలేని విలువైన ఆస్తి అని జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ స్పందన హాలులో జిల్లా స్థాయిలో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులకు 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో భాగంగా ప్రతిభ పురస్కారాల బహూకరణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా కలెక్టర్ తోపాటు కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్ రెడ్డి, ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర కీర్తి ప్రతిష్టలను ప్రపంచ వ్యాప్తం చేసే దిశగా విద్యార్థులను ప్రోత్సహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో విప్లవాత్మక సంస్క రణలకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అన్ని రకాల విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ తల్లిదండ్రుల ఆశయాలకు, తమ ఆసక్తికి అనుగుణంగా విద్యా నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రతిభ అవార్డులను అందజే స్తున్నారని చెప్పారు. రాష్ట్ర స్థాయిలో ఈ నెల 20వ తేదీన పురస్కారాలను అందిస్తారని చెప్పారు. అనంతరం ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికైన విద్యార్థులకు ప్రశం సా పత్రాలు, మెడల్, శాలువా జ్ఞాపికలు అందజేసి సత్కారంతో పాటు నగదు బహుమతిని అతిథుల చేతుల మీదుగా ప్రదానం చేశారు. కార్యక్రమంలో డిఇఒ వై. రాఘవరెడ్డి, ఆర్ఐఒ రమణ రాజు, ఎస్ఎస్ఎ పిఒ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి బిసి వేల్ఫేర్ ఈడి డాక్టర్ వి.బ్రహ్మయ్య, ఎస్‌సి కార్పొరేషన్ ఈడి డాక్టర్ కడప ఎంఇఒ నారాయణ, స్థానిక కార్పొరేటర్ పాకా సురేష్, ఎంఇఒలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. **పోరుమామిళ్ల :** ఆంధ్ర ప్రదేశ్ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల స్థాయిలో ప్రభుత్వం ప్రకటించిన ప్రథమ, ద్వితీయ, తృతీయ నగదు బహుమతులు వరుసగా రూ. 3 వేలు, రూ. 2 వేలు, రూ. వయ్యి ఇవ్వటమే కాకుండా ప్రతాపరెడ్డి స్వంతంగా మరికొంత నగదును విద్యార్థులకు అదనంగా బహుమతిగా ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ శివ ప్రసాదు, ఉపాధ్యాయ ఉపాధ్యాయునులు , విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. **చింతకొమ్మదిన్నె :** మండల ప్రధాన కేంద్రమైన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు ద్వారా ఎంఇఒ వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో నగదు బహుమతులను అందజేశారు. 2022-23 విద్యా సంవత్సరం పదవ తరగతి పరీక్షలు రాసిన వి స్నేహలత (515/600), బి వర్షిత (512/600), యు శివ జ్యోతి (505/600) లకు వరుసగా రూ. 3 వేలు, రూ.2 వేలు, రూ. వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీరాములు రెడ్డి, సర్పంచ్ మహేశ్వర్ రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ రామచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు కె.శోభారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **వల్లూరు :** స్థానిక ఎపి మోడల్ కళాశాలలో ఇంటర్‌లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థిని మేకల రేణుశ్రీ జగనన్న ఆణిముత్యాల కింద కలెక్టర్, కమలాపురం ఎమ్మెల్యే చేతుల మీదుగా రూ. 50 వేల చెక్కును అందు కుంది. విద్యార్థులు ఎదగాలంటే కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలన్నారు. అనంతరం మోడల్స్ స్కూల్ ప్రిన్సిపల్ సురేష్ బాబును కలెక్టర్, ఎమ్మెల్యే అభినందించారు.



వల్లూరు : విద్యార్థి మేకల రేణుశ్రీకి రూ. 50 వేలు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ , ఎమ్మెల్యే

పొదుపు సంఘాలతోనే అభివృద్ధి సాధ్యం

కడప : జిల్లాలో పేదరిక నిర్మూలన, మహిళా అభివృద్ధి, సాధికారిత పొదుపు సంఘాల బలోపేతంలోనే సాధ్యం అవుతుందని కలెక్టర్ వి. విజయ్ రామరాజు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ సభా భవన్‌లో డిఆర్‌డిఎ, మెప్మా పరిధిలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జరుగుతున్న వివిధ రకాల పనుల పురోగతిపై క్షేత్ర స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యంగా జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను లక్ష్యం మేరకు పూర్తి చేయాలన్నారు. 'పేదలందరికీ ఇళ్లు' గృహ నిర్మాణ పథకంలో భాగంగా స్వయం సహాయక సంఘాలకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించినా గృహ నిర్మాణాలు బేస్ మెంట్ లెవెల్ ఎందుకు దాటడం లేదని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు వారాల్లోగా గృహ నిర్మాణాల లక్ష్యాల్లో పురోగతి కనిపించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలకు స్థానికంగా ఉన్న పాల ఉత్పత్తి దారుల ద్వారానే ఆరోగ్యకరమైన పాలను సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పులివెందుల నియోజకవర్గంలో అముల్ కేంద్రాలకు పాలు వేయని వారిని ఆయా కేంద్రాలకు పాలు పోసేలా ప్రోత్సహించి రైతులను లాభాల బాటలో నడిపించాలన్నారు. జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలతో పాటు వికలాంగులు, వృద్ధాప్య, ఎఫ్‌పిఒ, రాగ్ పికర్స్, చిరు వ్యాపారుల గ్రూపులను ఏర్పాటు చేస వారి జీవన ప్రమాణాలను, ఆర్థిక స్థితిని మెరుగు పరచాలన్నారు. డిఆర్‌డిఎ, మెప్మా సిబ్బంది ప్రతి ఒక్కరూ గ్రూప్ ఫార్మేషన్, ఫైనాన్సింగ్, గ్రౌండింగ్, బుక్ కీపింగ్ మొదలైన ప్రక్రియలను క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో డిఆర్‌డిఎ డిపిఎంలు, ఏపీడీలు, మెప్మా సిఎంఎంలు, సెర్ఫ్ సిబ్బంది పాల్గొన్నారు.



దళితులనుద్దేశించి మాట్లాడుతున్న హరిప్రసాద్

అశోక్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

నగరంలోని 50వ డివిజన్ రుకవారిపల్లెలో సెల్ టవర్ నిర్మాణాన్ని అడ్డుకుని, పై అధికారులకు ఫిర్యాదు చేశారని కోపంతో దళితులపై పిడిబాకుతో దాడి చేసి దుర్భాషలాడిన వైసిపి నాయకుడు అశోక్ రెడ్డి పై ఎస్సీ ఎస్టీ, హత్యా యత్నం కేసు నమోదు చేయాలని టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి హరి ప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం దాడిలోగాయపడ్డ వారిని పరామర్శించారు. అక్రమంగా నిర్మిస్తున్న సెల్ టవర్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అనుమతులు లేకుండా సెల్ టవర్ నిర్మాణం జరుగుతుంటే స్థానికంగా ఉన్న దళితులు తను దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. వారితో కలిసి గతంలో కమిషనర్ కు విన్న వించామని చెప్పారు. పనులను నిలుపుదల చేశారని, మళ్లీ నిర్మాణం జరుగుతుంటే శుక్రవారం కమిషనర్‌కు మరోమారు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. దీంతో ఆగ్రహించిన స్థానిక వైసిపి నాయకుడు అశోక్ రెడ్డి శుక్రవారం సాయంత్రం వారి వద్దకు వెళ్లి దుర్భాషలాడి కత్తితో దాడి చేశాడని తెలిపారు. అతనిపై దళితులు చెన్నూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సీ, ఎస్టీ కేసు మాత్రమే పెట్టారని, హత్యాయత్నం కేసు నమోదు చేయలేదని వాపోయారు. ధర్నా అనంతరం డిఎస్‌పిని కలిసి విషయాన్ని తెలియజేశామని, ఆయన స్పందిస్తూ విచారించి తగు చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. అశోక్ రెడ్డి పై కఠిన చర్యలు తీసుకోకపోతే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

పిఆర్ఆర్ఎం కళాశాలలో రక్తదాన శిబిరం

కడప అర్బన్ : పి.రామిరెడ్డి మెమోరియల్ కళాశాల, ఖున్ కా రిష్టా ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. శనివారం పి.రామి రెడ్డి మెమోరియల్ ఫార్మసీ కళాశాలలో సేవే గమ్యం అనే నినాదంతో ముందుకు సాగే రామి రెడ్డి విద్యా సంస్థ, అదే బాటలో ఎన్నో రక్తదాన శిబిరాలు చేబడుతున్న ఖున్ కా రిష్టా చారిటబుల్ ట్రస్ట్ రక్తదాన శిబిరానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. రక్తదానం ప్రాముఖ్యతను, కలిగే ప్రయోజనాలను ముఖ్య అతిథిగా విచ్చేసిన కళాశాల చైర్మన్ ఈశ్వర్ రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ నెల్సన్ కుమార్ వివరించారు. మొత్తం 72 మంది ఈ శిబిరంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో స్టేఫ్ ఆఫీస్ సుబ్బరాయుడు, కళాశాల మేనేజ్మెంట్ నర్సింహ, గౌతమ్, ఎన్ఎస్ఎస్ యూనిట్ సభ్యులు, రిమ్స్ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది డాక్టర్ ప్రవీణ్, టెక్నీషియన్లు నరేష్, హరి,బోగా పార్వతమ్మ బ్లడ్ బ్యాంక్ సిబ్బంది వెంకట్‌రెడ్డి, టెక్నీషియన్లు రమణ, సుబ్రమణ్యం, వాహీద్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానం

కడప : కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో 30 రోజులపాటు ఉచిత శిక్షణ ఇస్తారని, ఆసక్తి అర్హత గల మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 18-45 సంవత్సరాల మధ్య వయస్సు గల గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలు ఉచిత శిక్షణను పొందేందుకు అర్హులని తెలిపారు. ఉచిత శిక్షణ ఈ నెల 26 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9440905478, 9985606866లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

ప్రొఫెసర్‌పై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలి

కడప అర్బన్ : పౌరహక్కుల నాయకులు ప్రొఫెసర్ హరగోపాల్ నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ, ప్రభుత్వానికి సరైన సూచనలు చేస్తూ, అభ్యుదయ భావాలతో రాష్ట్ర, దేశ అభివృద్ధికి కృషి చేస్తున్నారు. అలాంటి వ్యక్తి పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దేశద్రోహం కేసును బనాయించడాన్ని సిపిఎం జిల్లా కమిటీ ఖండిస్తుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తక్షణమే ఈ కేసును ఉపసంహరించుకోవాలని తెలిపారు. ప్రొఫెసర్‌గా తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించి రిటైర్డ్ అయిన తరువాత కూడా ప్రొఫెసర్ హరగోపాల్ ప్రజాసేవలో ఉన్నారని పేర్కొన్నారు. ఉపాధి, తాగునీరు, భూసమస్యలు, దళిత, గిరిజనులపై దాడులు అంశాలపై స్పందిస్తూ సమావేశాలు, సెమినార్లు పెడుతూ ప్రభుత్వం దృష్టికి తెచ్చి సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. దేశద్రోహం కేసులు నమోదు చేయడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమాలు చేశారని, అలాంటి వ్యక్తిపై దేశద్రోహం కింద కేసులు నమోదు చేయడం గర్హనీయని తెలిపారు. సుప్రీం కోర్టు అభిశంసించిన దేశద్రోహ చట్టాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవాలని పేర్కొన్నారు. ప్రజలు, ప్రజాతంత్రవాదులు, మేధావులు ప్రభుత్వ ఈ చర్యను నిరసించాలని తెలిపారు.

నేటి సదస్సును జయప్రదం చేయండి

కడప అర్బన్ : ప్రజలపై విద్యుత్ భారాలు మోపడం సరికాదని సిపిఎం నగర కమిటీ సభ్యులు డి.ఎం.ఓబులేసు అన్నారు. శనివారం విద్యుత్ సంస్కరణలు-భారాలు తక్షణ కర్తవ్యం అంశంపై నిర్వహించే సదస్సు కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 18న పాతబస్టాండ్‌లోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సాయంత్రం నాలుగుగంటలకు సదస్సు ప్రారంభమవుతుందని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

మాదక ద్రవ్యాలను అరికట్టాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

మాదకద్రవ్యాల సరఫరా, వినియోగాన్ని అరికట్టి యువత జీవితాలను కాపాడాలని ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ అల్ ఇండియా సౌత్ జోన్ అడ్వైజర్ ఖలీక్ అలీ ఖాన్, పీస్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ సయ్యద్ గౌస్ పీర్, యాంటీ క్రైమ్ ఆర్గనైజేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్. అరిఫ్ పుల్లా, మైనార్టీ అండ్ బ్యాక్ వర్డ్ కమ్యూనిటీ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ జిల్లా అధ్యక్షులు సలీం బాషా కోరారు. డిఎస్‌పి షరీఫ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో విపరీతమైన మాదకద్రవ్యాల వినియోగం కొనసాగుతుందని చెప్పారు. చిన్నపిల్లలు బలవుతున్నారని తెలిపారు. మాదకద్రవ్యాల ముఠాను పట్టుకొని విద్యార్థులు, చిన్న పిల్లలను రక్షించాలని విజ్ఞప్తి చేశారు.



వినతిపత్రం అందజేస్తున్న గౌస్‌పీర్

నిర్లక్ష్యం

ప్రజాదృష్టి

ఉపాధ్యాయులకు బదిలీల బెంగ పట్టుకుంది. ఐదేళ్లు, ఎనిమిదేళ్లు సర్వీసు నిండిన ఉపాధ్యాయులకు బదిలీలు అనివార్యం. ఉమ్మడి కడప జిల్లాలోని 12 వేల మంది ఉపాధ్యాయుల్లో 50 శాతం మందికి బదిలీలు తప్పడం లేదు. కడప జిల్లాలో 3,800 మంది ఉపాధ్యాయులకు బదిలీలు కానున్నట్లు సమాచారం. ఆన్‌లైన్‌లో బదిలీల ఆప్షన్ ఎంపిక చేయడంలో ఎడిట్ ఆప్షన్ అంశంలో చోటుచేసుకున్న చిన్న పొరపాటుకు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. కంపల్సరీ, టెంపరవరీ బదిలీల అప్షన్ ఎంపిక దగ్గర చోటుచేసుకున్న పొరపాట్లకు సుమారు 40 మంది ఉపాధ్యాయులు భారీమూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఉదాహరణకు కొండాపురం మండలానికి చెందిన ఓ ఉపాధ్యాయుడు బదిలీ ఆప్షన్ దగ్గర చోటుచేసుకున్న తప్పిదానికి నందలూరు మండలం పొత్తపికి బదిలీ అయ్యారు. జిల్లాలో చివరి ప్రాంతం నుంచి అన్నమయ్య జిల్లాలోని మారుమూల ప్రాంతానికి బదిలీ అయ్యారు. చిట్వేలి మండలం నుంచి అట్లూరు మండలం కమలకూరుకు బదిలీ చేశారు. భార్యాభర్తలిద్దరూ ఒకరు చిట్వేలి, మరొకరు అట్లూరు మండలంలోని కమలకూరులో పనిచేయాల్సి వస్తోంది. వీరికి సహజంగా స్పౌస్ కింద బదిలీలు చేయాల్సి ఉండగా, తాజా బదిలీల్లో విరుద్ధ ప్రాంతాల్లో పని చేయాల్సి వస్తోంది. మరో 30 మంది ఉపాధ్యాయులకు బదిలీల తలనొప్పులు తప్పడం లేదు. స్పష్టమైన గైడ్‌లైన్ విడుదల చేయని నేపథ్యంలో జిల్లా విద్యాశాఖాధికారి ఏమీచేయలేని నిస్సహాయ పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో బదిలీ ఆప్షన్ ఎంపిక చేసుకున్న అనంతరం డిఇఒ లాగిన్‌కు చేరుకుంటుంది. డ్రాయింగ్ అధికారి పరిశీలన అనంతరం జిల్లా విద్యాశాఖారి పరిశీలన చేయాల్సి ఉంది. ఇద్దరు ఉన్నతాధికారుల పరిశీలన అనంతరం బదిలీలను అప్‌లోడ్ చేయాల్సి ఉంది. వీరిద్దరూ డిఇఒ లాగిన్‌లోని బదిలీల అంశాన్ని పరిశీలన చేయకుండా అప్‌లోడ్ చేయడం ఉపాధ్యాయుల వెతలకు కారణమనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. వృత్తి జీవితంలో పదేళ్లపాటు పనిచేయాల్సిన విషయంలో బదిలీల విషయంలో బాధ్యతారాహిత్యానికి పాల్పడిన అధికారులే తప్పిదానికి బాధ్యత వహించాల్సి ఉందనడంలో సందేహం లేదు. గురుకులం ఉపాధ్యాయుల బదిలీల్లో గందరగోళం నెల కొంది. గతంలో కాంట్రాక్టు ప్రాతిపదికన తీసుకున్న ఉపాధ్యాయుల కొనసాగింపు విషయంలో గందరగోళం నెలకొంది. కాంట్రాక్టు ఉపాధ్యాయుల కొనసాగింపు విషయంలో నెలకొన్న స్తబ్దతను తెరదించాల్సి ఉంది. దీనిపై ఉపాధ్యాయ ఎమ్మెల్సీ జోక్యం చేసుకుని ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి కొనసాగించేలా చర్యలు తీసుకున్నప్పటికీ ఉపాధ్యాయుల్లో గందరగోళం కొనసాగుతూనే ఉంది. వీరిలో కొందరి పేర్లు కనిపించకపోవడంతో కాంట్రాక్టు ఉపాధ్యాయుల్లో ఆందోళన తగ్గడం లేదు. దీనిపై ప్రభుత్వం స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందనడంలో సందేహం లేదు.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ప్రతి ఎకరాకు సాగునీరు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాంట్లో వద్ద ఉన్న జిఎన్ఎస్ఎస్ ప్రధాన బ్రాంచ్ కెనాల్ నుండి ఆకుతోటపల్లి చెరువుకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు నింపేందుకు జరుగుతున్న పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చెరువుకు నీరు నింపడం వల్ల దాదాపు 2,500 ఎకరాలకు నీరు అందుతుందన్నారు. ఉప్పలూరు, ఆకుతోటపల్లి, చిన్నక్రైతపల్లి, సోంపల్లె కొలవలి, గంగనపల్లె, పోతలపల్లె గ్రామాలకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎంపీ అవినాష్‌రెడ్డి సహాయ సహకారాలు, సుధీర్‌రెడ్డి కృషితో చెరువుకు నీరు నింపడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి మునిరాజారెడ్డి, వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, నాయకులు శివారెడ్డి, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఆర్థిక చేయూతనిచ్చేందుకే వైఎస్ఆర్ పశుబీమా

ప్రజాశక్తి - ముద్దనూరు

ప్రమాదవశాత్తు మరణించే పశువుల యజమానులకు ఆర్థిక చేయూతనిచ్చేందుకు వైఎస్ఆర్ పశుబీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని కొత్తపల్లె పశువైద్యాధికారి వాసా శ్రీనివాస తెలిపారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం ఆయన వైఎస్ఆర్ పశుబీమా పథకాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీనివాస మాట్లాడుతూ పశువుల వారీగా బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. రూ.384 చెల్లిస్తే రూ.30వేలు, రూ.192 చెల్లిస్తే రూ.15వేలు, రూ.75 చెల్లిస్తే రూ.6వేలు వస్తుందన్నారు. మూడేళ్ల వరకు ఈ సౌకర్యం వర్తిస్తుందన్నారు. వివరాలకు ఆయా పశు కేంద్రాల్లో సంప్రదించాలన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి కోరారు.

వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్‌నగర్ కాలనీలో ఉన్న మదర్‌థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో శనివారం అన్నదానం, మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. ఎస్‌బి హెడ్ కానిస్టేబుల్ రమణారెడ్డి కుమారుడు విష్ణు స్వరూప్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. అనాథ వృద్ధులకు సేవ చేస్తున్న ఆశ్రమ నిర్వాహకుడు వెంకటసుబ్బయ్యను అభినందించారు. కార్యక్రమంలో రమణారెడ్డి కుటుంబ సభ్యులు విష్ణు స్వరూప్‌రెడ్డి, సౌజన్య, ధరణి, బయమ్మ పాల్గొన్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి - ఖాజీపేట

రైతులు భూసార పరీక్షలు తప్పక చేయించుకుని, మంచి ఫలితాలను బట్టి పంటను సాగు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని పుల్లూరు రైతు భరోసా కేంద్రాన్ని శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలన, పచ్చి రొట్ట విత్తనాలు, ఎరువుల పంపిణీ రికార్డులను పరిశీలించారు. భూసార పరీక్షలు తప్పక చేయించుకోవాలని సూచించారు. ఆర్‌బికె సిబ్బందికి తగు సూచనలు చేశారు. మండల వ్యవసాయ అధికారి నాగార్జున మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 402 మట్టి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపిస్తున్నారు. భూసార పరీక్ష ఆధారంగా ఎరువులను వినియోగించాల్సిన అవసరం ఉందన్నారు.


మట్టి నమూనా సేకరణలో వ్యవసాయాధికారులు

ఒఆర్ఎస్ తప్పక వినియోగించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ఉష్ణత అతిసార నివారణకు ఒఆర్ఎస్ తప్పక వినియోగించాలని మండల వైద్యాధికారి ఎస్.ముబీన్ తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆమె మాట్లాడుతూ అతిసార వ్యాధికి వైద్యులు ఒఆర్ఎస్, జింక్ సరైన చికిత్స సిఫారసు చేస్తున్నామన్నారు. పిల్లల్లో శక్తి, బలం యధావిధిగా రావడానికి ఇవి ఉపయోగపడుతాయన్నారు. పుట్టినరోజు నుండి ఐదు ఏళ్ల చిన్నారుల్లో విరేచనాలు అవుతుంటే ఒక లీటర్ నీటిలో ఒఆర్ఎస్ ఒక ప్యాకెట్‌ను శుభ్రంగా ఉండే పాత్రలో బాగా కలపాలన్నారు. ఈద్రావణాన్ని పిల్లలకు పట్టించాలన్నారు. ఒక చెంచా తాగునీరు లేదా తల్లి పాలలో బాగా కలిపిన ఒక జింక్ మాత్రను 14 రోజులు క్రమం తప్పకుండా ఇవ్వాలన్నారు. వైద్య విస్తరణాధికారి రాఘవయ్య, సిహెచ్ఒ వెంకటసుబ్బమ్మ, ఆశ నోడల్ పర్సన్ అరుణ కుమారి, సూపర్‌వైజర్స్ శోభన్‌బాబు, బి.కృష్ణప్రియ, ఎఎన్ఎంలు రాధా, సునీత, ఆశా కార్యకర్తలు విజయకుమారి, మేరీ, వరలక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నీట్‌లో శ్రీచైతన్య పూర్వ విద్యార్థి ప్రతిభ

వేంపల్లె : నీట్ పరీక్షల్లో వేంపల్లెలోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థి ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి అన్నారు. 2023-24 నీట్ పరీక్షలో పి.చెంద్రాయుడు అనే పూర్వ విద్యార్థి ఆల్ ఇండియా ఈడబ్ల్యుఎస్‌లో 247వ ర్యాంక్, ఆల్ ఇండియాలో 2885 ర్యాంకు సాధించారని చెప్పారు. ఎంసెట్‌లో రాష్ట్రస్థాయిలో 53వ ర్యాంకు సాధించడం సంతోషంగా ఉందన్నారు. చెంద్రాయుడును చక్రపాణిరెడ్డి, డైరెక్టర్లు చేతన్‌రెడ్డి, చైతన్యరెడ్డి అభినందించారు.

పౌష్టికాహారం అందజేత

ప్రొద్దుటూరు : ఆరోగ్యంగా ఉండాలంటే పౌష్టికాహారం ఎంతో అవసరమని టిబి యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. స్థానిక ఆస్పత్రిలోని టిబి యూనిట్‌లో శనివారం టిబి ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా రోగులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ (లెప్రసీ) శివశంకరయ్య, టిబి యూనిట్ సూపర్‌వైజర్లు మాధవరెడ్డి, హుసేన్‌బాషా, టిబి హెల్త్ విజిటర్స్ గురుప్రసాద్, సిద్దారెడ్డి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని విశ్వనాథపురం గ్రామానికి చెందిన భూమిరెడ్డి పుల్లారెడ్డి (57) పురుగుల మందు సేవించి, చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడని ఎస్ఐ మైనుద్దీన్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన మేరకు వివరాలు.. పుల్లారెడ్డి కుమార్తె ఇటీవల ప్రసవం కోసం అమ్మగారి ఇంటికి వచ్చింది. ప్రతిరోజు మద్యం సేవించి ఇంటిలో ఇబ్బందికర వాతావరణం ఏర్పడుతుండడంతో పుల్లారెడ్డిని భార్య మందలించింది. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన ఆయన గ్రామ సమీపంలోని పంట పొలాల్లో ఈ నెల 12న పురుగుల మందు సేవించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యవసాయ విద్యుత్ మోటర్ చోరీ

ప్రజాశక్తి - చాపాడు

మండల కేంద్రమైన చాపాడు పోలీస్‌స్టేషన్ సమీపంలోని రంగయ్య సత్రం పంట పొలాల్లో శుక్రవారం రాత్రి వ్యవసాయ విద్యుత్ మోటర్ చోరీకి గురైంది. చాపాడు గ్రామానికి చెందిన రాజోలి దొరస్వామిరెడ్డి 15 ఏళ్లుగా కౌలుకు పొలం చేస్తున్నాడు. ఈ పొలంలో అమర్చుకున్న రూ.30వేలు విలువ చేసే వ్యవసాయ విద్యుత్ మోటర్‌ను గుర్తు తెలియని దుండగులు అపహరించారు. ఈ ఘటనపై చాపాడు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు బాధితుడు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక పులివెందుల రోడ్డులో శనివారం మోటర్ బైకును వెనుకవైపు నుంచి జెసిబి ఢీ కొన్న సంఘటనలో రఫీ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. వేంపల్లెకు చెందిన రఫీ మోటర్ బైక్‌లో ఐస్‌క్రీమ్ వ్యాపారం చేసుకుని వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

ప్రభుత్వాస్పత్రిలో దోబీని నియమించాలి


రఫిక్‌పాషాకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు ప్రభుత్వాసుపత్రిలో దోబీ (బట్టలు ఉతికే వారిని)ని నియమించాలని సిఐటియు పట్టణ నాయకుడు దాసరి విజయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎ.వినయ్‌కుమార్ కోరారు. ఆ మేరకు శనివారం వారం ఆస్పత్రి సూపరింటెండెంట్ రఫిక్ పాషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోగుల సంఖ్య ఎక్కువగా ఉన్నందున సిబ్బందిని పెంచాలన్నారు. ఎక్కువ అవ్వడం వలన రోజురోజుకు రద్దీగా మారుతుందన్నారు. ఈ తరుణంలో చాలామంది వివిధ .స్వీపర్సు కూడా తక్కువ సంఖ్యలో ఉన్నారని అన్నారు. దాదాపు 100 పడకల ఆస్పత్రికి దోబీ ఉండాలన్నారు. గతంలో కాంట్రాక్టు పద్ధతిలో ఉన్న దోబీకి సరిగా జీతాలు ఇవ్వకపోవడంతో మానేశారన్నారు. ప్రస్తుతం స్వీపర్స్ చేతనే దోబీ పని చేయిస్తూ, పనిభారం పెంచుతున్నారన్నారు. ఇక్కడ అన్ని రకాల వైద్యులు అందుబాటులో ఉండడం వల్ల రోగుల సంఖ్య పెరిగిందన్నారు. ఆస్పత్రితోపాటు పరిసరాలు శుభ్రంగా ఉంచాలని వారు కోరారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సుదర్శన్ రాజు, మోషా పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ మాధవకృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సభాభవనంలో శనివారం మండల సర్వసభ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకాన్ని వాలంటీర్లు ప్రతి ఇంటికి చేరవేయాలన్నారు. రేషన్‌కార్డు లేని లబ్ధిదారులకు కూడా ఈ నెలలో వాటిని అందిస్తామన్నారు. ఎంపిడిఒ వెంకటేష్ మాట్లాడుతూ ఉపాధి హామీ ద్వారా వచ్చే పండ్ల తోటలను రైతులు సద్వినియోగ పరచుకోవాలని కోరారు. మండల ప్రత్యేక అధికారి అశోక్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ హౌసింగ్‌కు సంబంధించిన ఎం బుక్కులను ఎప్పటికప్పుడు తయారు చేస్తూ లబ్ధిదారులకు డబ్బులు అకౌంట్‌లో జమ అయ్యేలా చూడాలన్నారు. ఏఏ గ్రామంలో వైఎస్ఆర్ గృహ నిర్మాణానికి సంబంధించి పెండింగ్‌లు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపిపి వరలక్ష్మి, వ్యవసాయ శాఖ ఎడి, అగ్రికల్చర్ అధికారి రాఘవేంద్రారెడ్డి, ఎఒ నాగలక్ష్మి, మండల అధికారులు, సర్పంచులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ వెంకటేశ్వర్లు

పవన్‌కల్యాణ్ స్థిరత్వం లేని వ్యక్తి : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

జన సేన నాయకుడు పవన్‌కల్యాణ్ స్థిరత్వంలేని వ్యక్తి అని, ఇలాంటి వ్యక్తి నాయకుడు అనిపించుకోలేడని ఎమ్మెల్యే రాచమల్లు శివ ప్రసాదరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తాను సిఎం అభ్యర్థిని కాను అని గతంలో, రెండు రోజుల క్రితం మాటమార్చి తాను సిఎం అభ్యర్థిని అని ప్రకటించడం ఆయన చంచల మనస్తత్వానికి అద్దం పడుతోందన్నారు. తన బలం, బలహీనత, శక్తిసామర్థ్యాలు తనకే తెలియకపోతే రాష్ట్ర పరిస్థితిపై ఏమి అవగాహన ఉంటుందని ప్రశ్నించారు. తాను సిఎం అభ్యర్థిని కాను అన్నప్పుడు ఓట్ల శాతం తగ్గిపోతుందని మాజీ ముఖ్యమంత్రి బాబు సలహా మేరకు మళ్లీ మాటమార్చారని అన్నారు. పవన్ తన జనసైనికులను, కాపులను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని 175 స్థానాలకు పోటీ చేసే వ్యక్తి మాత్రమే సిఎం రేసులో ఉంటారని తెలిపారు. టిడిపి పొత్తుతో ఏ 30 స్థానాలకో పోటీ చేసి మూడు, నాలుగు స్థానాల్లో గెలిచే వ్యక్తి సిఎం అభ్యర్థి ఎలా అవుతారో పవన్ సమాధానం ఇవ్వాలన్నారు. తక్కువ స్థానాల్లో గెలిచినా పవన్ సిఎం అభ్యరి అని చంద్రబాబు ప్రకటిస్తే సమంజసంగా ఉంటుందన్నారు. వారాహి యాత్రలో పవన్ కళ్యాణ్ చిల్లర మాటలు తప్ప, ప్రజాప్రయోజన మాటలు మాట్లాడడంలేదనేది ప్రజలు గమనిస్తున్నారన్నారు. తనని తాను ఎమ్మెల్యే స్థానం వరకే పరిమితం చేసుకున్నాడని, ధైర్యం ఉంటే పవన్ ప్రొద్దుటూరు నుండి పోటీ చేయాలన్నారు. అసెంబ్లీ గేటు తాకకుండా నేను ఆపుతానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బి.లక్ష్మిదేవి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి

ఇంటి పట్టాలు వెనక్కి తీసుకుంటాం

ఎర్రగుంట్ల : లబ్ధిదారులు ఇల్లు కట్టకపోతే పట్టాలను వెనక్కి తీసుకుంటామని తహశీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని చిలమకూరు గ్రామ సచివాలయంలో శనివారం లబ్ధిదారులతో గ్రామ పెద్దల సమక్షంలో తహశీల్దార్, ఎంపిడిఒ భాగ్యలక్ష్మి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఇంటి పట్టాలు 2020లో ఇవ్వగా ఇప్పటికీ 25 శాతం మంది లబ్ధిదారులు కూడా నిర్మాణం పూర్తి చేయలేదన్నారు. మండలంలో 17 లేఅవుట్లు ఇవ్వగా అందులో ప్రధానంగా అత్యంత విలువైనది, నేషనల్ హైవేకి సమీపానే ఒక్క చిలమకూరు గ్రామంలోనే ఉందన్నారు. మిగతా ఏ లేఔట్ కూడా అలా లేదన్నారు. ఇక్కడ మాత్రమే ప్రభుత్వ లేఔట్ సమీపాన ప్రయివేట్ వ్యక్తులు లేఔట్‌లు కూడా నిర్మిస్తున్నారన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు మోహన్‌రెడ్డి, రఘు నందన్‌రెడ్డి, రామంజులరెడ్డి, ప్రజాప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీచైతన్య డిగ్రీ కాలేజీ వార్షికోత్సవ వేడుకలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఏరియా ఆస్పత్రి సమీపంలో ఉన్న శ్రీ చైతన్య డిగ్రీ కాలేజీ వార్షికోత్సవ వేడుకలను శనివారం కరస్పాండెంట్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీ స్థాపించినప్పటి నుంచి ప్రతి ఏటా ఈ వేడు కలను ఘనంగా నిర్వహి స్తున్నా మన్నారు. విద్యా ర్థులకు నాణ్యమైన విద్యను అంది స్తున్నా మన్నారు. ప్రతి సంవత్సరం మంచి ఫలి తాలు వస్తున్నాయని వివ రించారు. అన్ని సౌక ర్యాలు తమ కళాశాలలో ఉన్నాయని తెలిపారు. ప్రత్యే కమైన ల్యాబ్‌లు, చక్కటి వాతావరణం, ప్రతిభగల అధ్యాపకులచే విద్యా బోధన అందిస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపల్ నారాయణరెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో ఉపాధ్యాయులు, కరస్పాండెంట్

29 నుంచి రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు

చాపాడు : ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణా తరగతులు ఈనెల 29 నుంచి మూడు రోజులపాటు బి.మఠంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష్య, ప్రధాన కార్యదర్శులు జి.శివకుమార్, వి.అన్వేష్ తెలిపారు. మైదుకూరు పట్టణంలో శనివారం వారు శిక్షణా తరగతుల కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్య.కా.సం. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు, దున్నేవారికే భూమి, రైతులకు గిట్టుబాటుధరలు, ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేస్తుందన్నారు. ధరలకు అనుగుణంగా రూ.600 కూలి ఇవ్వాలన్నారు. అన్యాక్రాంత భూములు స్వాధీనం చేసుకోవాలన్నారు. అసైన్‌మెంట్ కమిటీ ద్వారా భూములు పంపిణీ చేయాలని సంఘం జిల్లాలో పోరాటాలు చేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించే సంఘం రాష్ట్రస్థాయి శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో వ్య.కా.సం. మండల నాయకులు షరీఫ్, రాయప్ప, రవి, కళావతి, లక్ష్మీదేవి, మేరీ, విక్కీ, హుస్సేన్ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని సక్రమంగా ఏర్పాటు చేయాలి

జమ్మలమడుగు రూరల్ : విద్యుత్ శాఖ అధికారులు బెల్లాల వీధిలోని 13వ వార్డులో కాలువపై ఉన్న స్తంభాన్ని సక్రమంగా అమార్చలని టిడిపి ఇన్‌ఛార్జి చదిపిరాళ్ల భూపేష్‌రెడ్డి సూచించారు. ఎలాంటి ఆధారం లేకుండా కాలువపై వేసిన కరెంటు స్తంభాన్ని పరిశీలించమని స్థానికులు హేమసుందర్, ఆకుల శ్రీను, రమణారెడ్డి, పుల్లయ్యలు కోరగా.. శనివారం భూపేష్‌రెడ్డి స్వయంగా పరిశీలించారు. సమస్యను విద్యుత్ శాఖ అర్బన్ ఎఇ దృష్టికి భూపేష్‌రెడ్డి ఫోన్ ద్వారా వివరించారు. ఇందుకు ఎఇ స్పందిస్తూ వారంలోపు స్తంభాన్ని మారుస్తామని, ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసు కుంటామన్నారు. నాయకులు పొన్నతోట శీను, రఫీ, భూసిరెడ్డి, జింకల బాషా పాల్గొన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల


మండలంలోని చిలమకూరు గ్రామ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవాల సంఖ్య పెంచాలని డిప్యూటీ డిఎంహెచ్ఒ శాంతికళ సూచించారు. ఆస్పత్రిని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రసవాల గది, ల్యాబ్, రికార్డ్స్ పరిశీలించారు. ఎఎన్ఎంలతో జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. ఎన్‌సిడి, సిడి సర్వే 80శాతం కంటే తక్కువ చేసిన ఎఎన్ఎంలకు చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డాక్టర్లు సురేశ్మ, సాయిచరిత, సిహెచ్ఒ రమదేవి, హెల్త్ సూపర్వైజర్ విజయకుమారి, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్ఒ శాంతికళ

అవకతవకలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

మండలంలోని చిలమకూరు పంచాయతీ నిధుల అవకతవకలపై శనివారం ఎంపిటిసి నవీన్ కుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల నుంచి పంచాయతీ సెక్రటరీ కొందరి కాంట్రాక్టర్లతో కలిసి కాలువలు, రోడ్లు నిర్మాణం చేపట్టారని, పంచాయతీకి సంబంధించి సామగ్రి కొనుగోలు చేసినట్లు తెలిపారు. వాటికి సంబంధించి దాదాపు రూ.కోటి ఖర్చు చేసినట్లు చూపిస్తున్నారని ఆరోపించారు. కానీ వాస్తవానికి పనులు ఎక్కడా జరగలేదని, ఒకవేళ పనులు జరిగి ఉంటే చూపించాలని కోరామన్నారు. దానికి సమాధానం చెప్పకుండా పంచాయతీ సెక్రటరీ దాట వేస్తున్నారని ఆరోపించారు. దీనిపై విచారించి, తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతిపత్రమిచ్చామన్నారు. చిలంకూరు గ్రామానికి సంబంధించి పంచాయతీ స్థలంలో 2012లో అప్పటి ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి తన సొంత నిధులతో మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారన్నారు. బోరు పంచాయతీ నిధులతో వేశారని తెలిపారు. అప్పటి పంచాయతీ సర్పంచు పేరు మీద కరెంటు మీటర్ కూడా తీసుకున్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు కూడా పంచాయతీ ట్రెజరీ నుండి కరెంట్ బిల్లులు కడుతున్నారన్నారు. ప్రయివేట్ వ్యక్తులు మినరల్ వాటర్ ప్లాంట్‌కు సంబంధించి నీటిని అమ్ముకోవడమే కాకుండా, వాటర్ ప్లాంట్ కూడా వారిదే అంటూ పంచాయతీ సెక్రటరీ అంటున్నారని తెలిపారు. ఎంపిడిఒ, తహశీల్దార్ ఆధ్వర్యంలో స్థలం, వాటర్ ప్లాంట్ కరెంట్ బిల్లుల మీద విచారించాలని కోరామన్నారు. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న రూ.2,86,025 కరెంటు బిల్లును, పన్ను బకాయి, ఇంతవరకు పంచాయతీ చెల్లించిన కరెంటు బిల్లులను కూడా వారి నుండి వసూలు చేయాలని డిమాండ్ చేశామన్నారు. ఆర్‌టిఐ యాక్ట్ ప్రకారం పంచాయతీ వారు ఇచ్చిన పత్రాలు 2012 నుండి ఇప్పటివరకు కరెంట్ బిల్లులకు సంబంధించిన స్టేట్‌మెంట్లను కూడా కలెక్టర్‌కు సమర్పించామన్నారు. వెంటనే వాటర్ ప్లాంట్‌ను పంచాయతీ వారు స్వాధీనం చేసుకోవాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి ధర్నా చేస్తామని తెలిపామన్నారు.


కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎంపిటిసి నవీన్

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని సిపిఎం కార్యదర్శి వీరనాల శివనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలో ఇసుక అక్రమ రవాణా విచ్చలవిడిగా సాగుతోందన్నారు. దీన్ని సంబంధిత సెబ్, రెవెన్యూ, అధికారులు అరికట్టాలన్నారు. అనుమతులు లేని ఇసుక రీచ్‌ల వద్ద ఇసుక అక్రమంగా తవ్వుతూ రవాణాకు పాల్పడుతున్నారని తెలిపారు. కొద్ది రోజుల క్రితం పెన్నానదిలో పదుల సంఖ్యలో ట్రాక్టర్లు పెట్టి ఇసుకను యథేచ్ఛగా తోలుతున్న సంఘటనను చూశామన్నారు. టిప్పర్లు బోల్తా పడి గాయపడిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. ఇసుక వాహనాలు పట్టణంలోని వీధుల గుండా, గ్రామాల మధ్య పోవడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యంగాఉందన్నారు. ప్రమాదాలకు కూడా జరిగిన సంఘటనలు ఉన్నాయన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై అధికారులు ఉక్కుపాదం మోపాలన్నారు. సిపిఎం నాయకులు పల్లా లక్ష్మినారాయణ, శ్రీను పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం నాయకులు శివనారాయణ

ఐ సెట్‌లో ఆర్‌టిడి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మే నెలలో నిర్వహించిన ఐ సెట్ పరీక్ష ఫలితాల్లో స్థానిక మైదుకూరు రోడ్డులోని రాణీ తిరుమలదేవి డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారని ఆ కళాశాల ప్రిన్సిపల్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన కళాశాలలో కరస్పాండెంట్ తరుణేందు శేఖర్, అధ్యాపక సిబ్బందితో కలిసి ఐ సెట్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు వందన (514 ర్యాంకు), లిఖిత (1970 ర్యాంకకు)ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చేరిన రోజు నుండి వారిపై ప్రత్యేకశ్రద్ధ కనబరుస్తామన్నారు. మంచి నైపుణ్యంగల అధ్యాపకులతో శిక్షణనిస్తామన్నారు. ఈ విద్యా సంవత్సరం నుండి నాలుగేళ్ల హనర్స్ డిగ్రీ (డిగ్రీ, పిజి) సింగిల్ సబ్జెక్టు విధానంలో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయని, ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మ్యూజియం పేరు మార్పు గర్హనీయం

- పిసిసి మీడియా ఛైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

దేశ రాజధాని న్యూఢిల్లీలోని తీన్‌మూర్తి భవన్‌లో ఉన్న నెహ్రూ మెమోరియల్ మ్యూజియం, లైబ్రరీ పేరు మార్చాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించడం దురదృష్టకరం, గర్హనీయమని పిసిసి మీడియా ఛైర్మన్ ఎన్.తులసిరెడ్డి తెలిపారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఢిల్లీలోని తీన్‌మూర్తి భవన్ నెహ్రూ అధికార నివాసమన్నారు. నెహ్రూ మరణాంతరం 1964 నవంబర్ 14న ఆయన పుట్టిన రోజున తీన్‌మూర్తి భవన్‌లో నెహ్రూ మెమోరియల్ మ్యూజియంతోపాటు లైబ్రరీని నాటి రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ ప్రారంభించారని తెలిపారు. 59ఏళ్లుగా అదే పేరుతో కొనసాగుతున్నట్లు చెప్పారు. ఇప్పుడు పేరు మార్చాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించడం శోచనీయమన్నారు. నెహ్రూ ప్రతిష్ఠను తగ్గించాలని మోడీ ప్రభుత్వం నిరంతరం ప్రయత్నిస్తున్నట్లు తులసిరెడ్డి విమర్శించారు. బిజెపి అభద్రత భావం, అల్పబుద్ధి, సంకుచిత తత్వానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా నెహ్రూ మెమోరియల్ మ్యూజియం పేరు మార్పు నిర్ణయాన్ని మోడీ ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని తులసిరెడ్డి కోరారు.

రేపటి నుంచి వీరయ్య స్వామి ఆరాధన

ప్రజాశక్తి - చాపాడు

మండలంలోని భద్రిపల్లె గ్రామంలో వెలసిన దిగంబర వీరయ్య స్వామి ఆరాధన మహోత్సవాలను సోమవారం నిర్వహిస్తున్నట్లు అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. గురుపూజ, పుష్పాలంకరణతో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. వివిధ గ్రామాల తాళాల భజన బృందాలచే 24 గంటల పాటు నిరంతరంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం రాత్రి శ్రీ సాయి నాట్య కళా సమితి అద్దంకి వారిచే దేవనర్తకి పూర్తి నాటకం ఉంటుందన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వారు తెలి పారు.

బండలాగుడు పోటీలు : ఈ సందర్భంగా న్యూ కేటగిరి బండలాగుడు పోటీలను మంగళవారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.60వేలు గ్రామ సర్పంచు గుత్తి మల్లేశ్వరి, రెండవ బహుమతి రూ.50 వేలు ఇరగంరెడ్డి కార్తీక్‌రెడ్డి, మూడవ బహుమతి రూ.40 వేలు చల్ల నడిపి గంగన్న, నాల్గవ బహుమతి రూ.30వేలు చల్లా పెద్ద గంగన్న, 5వ బహుమతి రూ.20వేలు భూమిరెడ్డి లక్ష్మిరెడ్డి, 6వ బహుమతి బడుగు కొండయ్య రూ.10వేలు, 7వ బహుమతి రూ.5వేలు గవిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి అందజేయనున్నట్లు వివరించారు.

ఎమ్మెల్యేను ఆహ్వానించిన కమిటీ : వీరయ్య స్వామి ఆరాధన ఉత్సవాలకు ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డిని ఉత్సవ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చందా రామసుబ్బారెడ్డి, అవధూత దిగంబర వీరయ్య స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను ఆహ్వానిస్తున్న కమిటీ సభ్యులు